# సీజనల్ వ్యాధులపై ఆందోళన చెందొద్దు

- రామాయంపేట మండలం సుతారిపల్లిలో 1 డెంగీ, 3 వైరల్ ఫీవర్ కేసుల నమోదు
- దోమలతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వ్యాధులు
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- రాష్ట్ర మలేరియా జోనల్ అధికారి సునీల్, రాష్ట్ర అస్టెంట్ డైరెక్టర్ నాగయ్య


రామాయంపేట: సుతారిపల్లిలో పరిసరాలు పరిశీలిస్తున్న మలేరియా జోనల్ అధికారి సురేశ్


రామాయంపేట: సుతారిపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న మలేరియా అధికారులు


రేగోడ్: కస్తూర్బా పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీసీఈవో ఎల్లయ్య

రామాయంపేట, జూలై 27: సీజనల్ వ్యాధులపై ఆందోళన చెందవద్దని రాష్ట్ర మలేరియా జోనల్ అధికారి సురేశ్, డైరెక్టర్ నాగయ్య తెలిపారు. శనివారం రామాయంపేట మండలం సుతారిపల్లి గ్రామంలోని వైద్య శిబిరాన్ని సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. గ్రామంలో వ్యాధులకు గురైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం వైద్యం అందుతుందన్నారు. గ్రామంలో 157 మంది రక్త నమూనాలు సేకరించామని, వారిలో 1డెంగీ, ముగ్గురికి వైరల్ ఫీవర్ నమోదైందన్నారు. దోమలు వృద్ధి చెంది అనారోగ్యాల పాలుచేస్తాయన్నారు. డీ.ధర్మారం డాక్టర్ హరిప్రియ ఉన్నారు.

**మురుగు కాల్వలను శుభ్రంగా ఉంచాలి**

పట్టణంలో మురుగు కాల్వలను వెంటవెంటనే శుభ్ర పర్చాలని ఆదేశించారు. మున్సిపాలిటీలోని మూడోవార్డులో చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ సందర్శించి, మున్సిపల్ సిబ్బందికి సూచనలిచ్చారు.

**వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

రేగోడ్/అల్లాదుర్గం, జూలై 27: రేగోడ్ కస్తూర్బా గాంధీ పాఠశాలను జడ్పీసీఈవో ఎల్లయ్య తనిఖీ చేశారు. అల్లాదుర్గం మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు.

**పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి**

పెద్దశంకరంపేట,జూలై27: పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి హరికృష్ణ అన్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయించాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు.

**జాగ్రత్తలు పాటించాలి**

నిజాంపేట, జూలై 27: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ, నీటి నిల్వల తొలిగించి, పరిసరాల శుభ్రత వంటివి పాటించాలని నగరం గ్రామ ప్రత్యేకాధికారి సందీప్‌రెడ్డి, కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్ అన్నారు.

**పారిశుధ్య వారోత్సవాలపై గ్రామసభలు**

చిలిపిచెడ్,జూలై 27: మండలంలోని చిట్కుల్, చండూర్, అజ్జమర్రి, సోమక్కపేట ఆయా గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు.


నిజాంపేట: నగరంలో నీటి నిల్వలను తొలిగిస్తున్న ప్రత్యేకాధికారి సందీప్‌రెడ్డి, కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్


పెద్దశంకరంపేట: సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి హరికృష్ణ


చిలిపిచెడ్: చిట్కుల్‌లో సీజనల్ వ్యాధులపై గ్రామ సభలో మాట్లాడుతున్న కార్యదర్శి తిరుపతి

## విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

**- డీఈవో రాధాకిషన్**

మెదక్ మున్సిపాలిటీ, జూలై 27: ప్రభుత్వ బడుల్లోని విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని, మంచి శిక్షణతో జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదిగేలా వ్యాయమ టీచర్లు కృషి చేయాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. శనివారం వెస్లీ పాఠశాలలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో పీడీ, పీఈటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలో క్రీడాకారులకు లోటులేదన్నారు. నైపుణ్యంతో కూడిన శిక్షణ అందిస్తే రాష్ట్రస్థాయిలోనే కాదు జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల, జోనల్ స్థాయిలో క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్, పీడీలు నాగరాజు, శ్రీనివాస్‌రావు, మాధవరెడ్డి, మధుసూదన్, శ్రీధర్‌రెడ్డి, వినోద్, నరేశ్, మహిపాల్, శారద, శ్వేత, శిల్ప, మంజులత, పీఈటీలు పాల్గొన్నారు.

**క్రీడా రంగానికి ప్రభుత్వం పెద్దపీట**

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో క్రీడాకారులను ప్రోత్సహించేలా రూ.325 కోట్లు కేటాయించడం హర్షణీయమని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో క్రీడారంగానికి ప్రత్యేక గ్రాంట్ ఇస్తానని సీఎం చెప్పడంతో మంచి రోజులు వచ్చాయన్నారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం


నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 27: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఫ్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21.389 కోట్లు కేటాయించిందని, ప్రస్తుతం దాన్ని తగ్గించారని అన్నారు. ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పి, ఆ ఊసేలేదన్నారు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు కార్తిక్, రవిబాబు, భాను పాల్గొన్నారు.

## మట్టి రోడ్డుకు మోక్షమెప్పుడో?



చిలిపిచెడ్, జూలై 27: చిలిపిచెడ్ నుంచి గుజిరి తండా, బద్రియ తండా, గౌతాపూర్ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. చినుకు పడితే ఈ దారిపై వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్ర నుంచి మట్టిరోడ్డుపై తండాలు, గ్రామానికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం ఉందని, గుజిరి తండాకు చెందిన గిరిజనలు కిరాణం, రేషన్, కూరగాయలు మార్కెట్ నుంచి తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి


నూతన ఖాతాదారులకు పుస్తకాలను అందజేస్తున్న ఏఎస్‌పి త్రిపాఠి

పెద్దశంకరంపేట, జూలై 27: గ్రామాల్లో తపాలా శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ సంగారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ త్రిపాఠి అన్నారు. మండలంలోని బుజురాన్‌పల్లిలో తపాలా సేవల సమీకృత సమ్మేళనం నిర్వహించారు. తపాలా శాఖ అందిస్తున్న సేవల గురించి వివరించారు. సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడపిల్లలకు వరంలాంటిదన్నారు. ప్రతిఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌పీఎల్‌ఐ, పీఎల్‌ఐ, ఆర్డీ, ఎస్‌బీ తదితర పథకాల గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి సబ్ డివిజన్ మెయిల్ ఓవర్సీస్ శ్రీనివాస్, ఎస్పీఎమ్ రఘు, మాజీ సర్పంచ్ విఠల్, ఉద్యోగులు మణయ్య, గంగారాం, విజయ్, రాఘవేందర్, నెహ్రూ, బీరప్ప, నిరంజన్, సవిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

## కుక్కలు, కోతుల నియంత్రణకు చర్యలు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్, జూలై 27: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో కుక్కలు, కోతుల బెడద అధికంగా ఉన్నదని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉచిత మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కోతులు, కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకునేందుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. శుక్రవారం నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్‌ను గాంధీ విగ్రహం నుంచి ఇండెన్ బ్యాంకు, అదనంగా మంగళవారం కూడా మార్కెట్‌ను నిర్వహించడానికి గాంధీ విగ్రహం నుంచి పోస్టాఫీస్ వరకు ఏర్పాటు చేసేందుకు తీర్మానించామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మున్సిపల్ కమిషనర్ జైత్‌రామ్ నాయక్ పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలు సత్వరమే అమలుచేయాలి

**- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు**

మెదక్ మున్సిపాలిటీ, జూలై 27: బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం చెప్పిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం విస్తృతస్థాయి సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించారు. రైతుబంధు ఇప్పటికే ఇవ్వాల్సి ఉన్నా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రూ.లక్ష లోపు రుణమాఫీ చేసినప్పటికీ బ్యాంకుల్లో మాఫీ కావాలంటే కొంత డబ్బు చెల్లించాలని అనడం సరైనది కాదన్నారు. బీజేపీ ప్రభుత్వం పాత పద్ధతుల్లోనే పాలన చేస్తున్నదన్నారు. సమావేశంలో నాయకులు మల్లేశం, నర్సమ్మ, నాగరాజు, సంతోష్, భాగయ్య, రేవంత్. జగన్, కమల, నాగమణి, యశోద, రాములు పాల్గొన్నారు.

## యూపీ కూలీలతో వరి నాట్లు


చండూర్‌లో వరి నారు తీస్తున్న యూపీ మగ కూలీలు

చిలిపిచెడ్, జూలై 27: వరి నాట్లకు కూలీల కొరత లేకుండా రైతులు వలస కూలీల మీద ఆధారపడుతున్నారు. నాట్లు వేసేందుకు యూపీ, బీహార్, కోల్‌కతా తదితర రాష్ట్రాల నుంచి భారీగా మగ, ఆడ కూలీలు తెలంగాణలో వస్తున్నారు. శనివారం మండలంలోని చండూర్‌లో యూపీకి చెందిన మగ కూలీలు నాట్లు వేస్తున్నారు. వీరికి ఎకరానికి 4,500 నుంచి 5,500 వరకు ఇస్తున్నారు.

# ధరణి పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- స్లాట్ బుకింగ్ ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయాలి
- జీరో కరెంట్ బిల్లులు, గ్యాస్ సబ్సిడీపై ఆరా
- కలెక్టర్ రాహుల్‌రాజ్


వెల్దుర్తి: జీరో కరెంట్ బిల్లుపై వస్తుందా రావట్లేదా అని లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న కలెక్టర్


వెల్దుర్తి ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థులకు గణితం బోధిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి, జూలై 27: ధరణి పెండింగ్ దరఖాస్తులకు ప్రత్యేక సమయాన్ని కేటాయించి, సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. శనివారం మాసాయిపేట గ్రామంలో ఆకస్మికంగా తనిఖీచేశారు. తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు, ధరణి దరఖాస్తులను పరిశీలించి, వాటి వివరాలను తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఆర్‌ఐ ధన్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డు గదిని పరిశీలించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి పరిసరాలను పరిశీలించి, సమస్యలపై ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం నాలుగో తరగతికి వెళ్లి ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు గణితం బోధించారు. విద్యార్థులతో బోర్డుపై లెక్కలు చేయించి, ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌తో మాట్లాడుతూ సరుకులు సమయానికి వస్తున్నాయా, నాణ్యమైన భోజనం పెడుతున్నారా అని వివరాలు అడిగి, సరుకులు తనిఖీ చేశారు. వెటర్నరీ దవాఖానలో రికార్డులు పరిశీలించారు. మందులు, వైద్య సేవలపై డాక్టర్ కావ్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో తిరుగుతూ పారిశుధ్యం, నీటి నిల్వపై పంచాయతీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జీరో కరెంట్ బిల్లులు, గ్యాస్ సబ్సిడీపై లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లను స్లాట్ బుకింగ్ చేసుకున్న సమయానుసారంగా చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. ప్రజావాణిలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై లిఖితపూర్వక సమాధానాలు ఇవ్వాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు. వెటర్నరీ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. కలెక్టర్ వెంట పంచాయతీ కార్యదర్శి రాణి, సిబ్బంది, ఉపాధ్యాయులు, ఉన్నారు.

**ఇంటింటా ఇన్నోవేటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి**

మెదక్ మున్సిపాలిటీ, జూలై 27: ఇంటింటా ఇన్నోవేటర్-2024ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని వర్గాల్లో గల ఆవిష్కర్తలు అద్భుతమైన ఆలోచనలు, ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ఆగస్టు 3వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది వచ్చిన ఆవిష్కరణల్లో మంచి ప్రాజెక్టులను ఎంపిక చేసి ఆగస్టు 15న అవార్డు అందజేస్తామన్నారు. దరఖాస్తులను వాట్సాప్ (9100678543) ద్వారా పంపవచ్చని పేర్కొన్నారు.

## డయల్ 100 కాల్స్‌పై తక్షణమే స్పందించాలి


మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సమావేశంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది

**- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి**

మెదక్ అర్బన్, జూలై 27: శాంతిభద్రతలు కాపాడడంలో బ్లూ కోట్స్ సిబ్బంది ముందుండి డయల్ 100 కాల్స్‌పై తక్షణమే స్పందించాలిని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో డయల్ 100 కాల్స్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు సర్వకాల సర్వావస్థల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పోలీస్ విభాగం కొన్ని వ్యవస్థల్ని ఏర్పాటు చేసిందన్నారు. అందులో 100 నెంబర్‌తో కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. 100 విధానానికి మరింత సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శకత, జవాబుదారీతనం జోడిస్తూ వ్యవస్థ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రతి ఫోన్ కాల్ రికార్డు చేసే ఇక్కడి సిబ్బంది, ఆ సమస్య పరిష్కారమయ్యాకే దాన్ని క్లోజ్ చేస్తారన్నారు. విపత్కర పరిస్థితిలో పోలీసు వారి సహాయం కావాల్సినప్పుడు ప్రజలు 100కి కాల్ చేస్తారని, వెంటనే దగ్గరలోని పోలీస్ సిబ్బంది వెళ్లి వారిని విచారించి, సమస్య పరిష్కరిస్తారన్నారు. సమావేశంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ తప్పనిసరి



న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్, జూలై 27: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు స్థిరాస్తులను క్రయవిక్రయాలు చేసినప్పుడు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి అనిత తెలిపారు. శనివారం నర్సాపూర్‌లోని కోర్టులో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి అనిత మాట్లాడుతూ పార్లమెంట్ ద్వారా భారత రాజ్యాంగబద్ధంగా నూతన చట్టాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చట్టబద్ధంగా అర్హులైన వ్యక్తులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు స్వరూపారాణి, ఆనంద్‌కుమార్, కోర్ట్ సూపరింటెండెంట్ పద్మావతి, మండల అధికారులు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భోజన విరామ సమయంలో టీచర్ల నిరసన



చిన్నశంకరంపేట, జూలై 27: ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని శనివారం చిన్నశంకరంపేటలోని మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. పదేండ్ల నుంచి బదిలీలు, ప్రమోషన్లు లేవన్నారు. వెంటనే ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రమోషన్ ఇచ్చి బదిలీలు చేయాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి, టీచర్లు శివకుమార్ సంజయ్‌కుమార్, శ్రీనివాస్, స్రవంతి, రాజశ్రీ, రెహాన డిమాండ్ చేశారు.


నర్సాపూర్: చిన్నచింతకుంటలో మొక్క నాటుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు

## వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి


చిన్నశంకరంపేట: మొక్కలు పంపిణీచేస్తున్న ఎంపీడీవో దామోదర్

నర్సాపూర్/చిన్నశంకరంపేట, జూలై 27: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు సూచించారు. శనివారం మండల పరిధిలోని చిన్నచింతకుంటలో శానిటైజేషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామసభలో పాల్గొన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ లో మొక్కలు నాటారు. చిన్నశంకరంపేట వనమహోత్సవంలో పాల్గొన్న ఎంపీడీవో దామోదర్ ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఆయనతో ఎంపీవో కరీముల్లా ఉన్నారు.

## ప్రతి రైతుకు పంట రుణమాఫీ చేయాలి


నిజాంపేట: నార్లాపూర్‌లో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

నిజాంపేట, జూలై 27: కొన్ని సాంకేతిక కారణాలతో మాఫీ కాని రైతులు ఆయా క్లస్టర్ల వారీగా ఉన్న ఏఈవోలను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. శనివారం మండలంలోని నార్లపూర్ గ్రామంలో పంట రుణమాఫీపై రైతులతో సమావేశం నిర్వహించారు. రూ.లక్ష లోపు పంట రుణం తీసుకున్న నార్లపూర్ గ్రామానికి చెందిన 174 మంది రైతులకు రుణమాఫీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి, కార్యదర్శి స్రవంతి, ఏఈవో శ్రీలత ఉన్నారు.

**రైతులందరికీ రుణమాఫీ చేయాలి**

చిలిపిచెడ్, జూలై 27: పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సోమక్కపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. రుణమాఫీ జాబితాలో చాలామంది పేర్లు రాలేదని, అర్హులైన ప్రతి రైతును గుర్తించి అందేలా అధికారులు చూడాలన్నారు. రైతు భరోసా ఇవ్వకుండా దానికి సంబంధించిన డబ్బులు రుణమాఫీకి మళ్లించి కాంగ్రెస్ రైతులను మోసం చేసిందన్నారు. రైతులకు వెంటనే రైతుభరోసా ఇవ్వాలన్ని కోరారు.

## ఓపెన్ జిమ్ ఏర్పాటుకు విరాళం



నిజాంపేట, జూలై 27: నిజాంపేటలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌కు దాతలు తమవంతుగా సాయం చేస్తున్నారు. శనివారం నిజాంపేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిష్టారెడ్డి తనవంతుగా రూ.13,500ల విరాళాన్ని ఆరోగ్యమే మహాభాగ్యం టీమ్ సభ్యుడు స్వామికి అందజేశారు.

## ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

చిన్నశంకరంపేట, జూలై 27: ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో దామోదర్ సూచించారు. మండలంలోని మిర్జాపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగిస్తే అనర్థాలను తమ తల్లిదండ్రులకు తెలుపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పుష్పవేణి, ఎంపీవో కరీముల్లా పాల్గొన్నారు.

## సైబర్ క్రైం, డ్రగ్స్ నియంత్రణపై అవగాహన

నిజాంపేట, జూలై 27: నిజాంపేటలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైం, డ్రగ్స్ నియంత్రణపై సీఐ వెంకటరాజగౌడ్ శనివారం అవగాహన కల్పించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్ఞానమాల, ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చాకరిమెట్లలో భక్తుల పూజలు


చాకరిమెట్ల ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఆంజనేయశర్మ

శివ్వంపేట, జులై 27: మండలంలోని చిన్న గొట్టిముక్ల పంచాయతీ పరిధిలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో సార శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవదత్తుశర్మ, ప్రభు రాజశర్మ, సిబ్బంది ఉన్నారు.

## చిన్నచింతకుంటలో ముగిసిన ఆర్‌ఆర్‌ఆర్ సర్వే

నర్సాపూర్, జూలై27: మండలంలోని చిన్న చింతకుంట గ్రామంలో ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం కోసం చేపట్టిన భూ సర్వే నేటితో ముగిసిందని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచింతకుంట గ్రామంలోని 20 మంది రైతులకు సంబంధించిన 20 ఎకరాల భూమిని ఆర్‌ఆర్‌ఆర్ కోసం సర్వే చేసినట్లు తెలిపారు. త్వరలోనే రెడ్డిపల్లి, రత్నాపూర్ గ్రామాల్లో ఆర్‌ఆర్‌ఆర్ సర్వే ప్రారంభిస్తామని వెల్లడించారు. సర్వేకు సహకరించిన చిన్నచింతకుంట గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు.

నమస్తే తెలంగాణ
లీగల్ ప్రకటనలు
స్థలాల కొనుగోలు, అమ్మకాలు మరియు లీగల్ ప్రకటనల కొరకు సంప్రదించగలరు.
లీగల్ ప్రకటనపై
30% తగ్గింపు
ప్రకటనల విభాగం...
సెల్: 8096677655